తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
సంపుటి : 01
సంచిక : 134
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఆదివారం, 03-12-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్ లో నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889
JB TV జయభేరి

## జయభేరి అక్షర తూటా



నేడే ఓట్ల లెక్కింపు
రాజకీయ ఉద్దండులకు ముచ్చెమటలు..

లెక్కలేసిన పెద్ద మనుషులే బొక్కలో పడతారా..!?
ఇసుకబుక్కిన నేతలు చిప్పకూడు తింటారా..!?

ఎన్నికల కమిషనర్
వికాస్ రాజు అమ్ముడుపోయాడట..
ప్రజాశాంతి పార్టీ కెఏ పాల్ ఆరోపణ..!

ఏమో ఎవరికి తెలుసు? ఎన్నికలు సజావుగా సాగుతున్నాయి,
అన్ని చర్యలు తీసుకుంటున్నాం, అని చెప్పిన..

ఓ.. పెద్దమనిషి పట్టుకున్న సొమ్ము ఎక్కడ!?
అని అడుగుతున్నారు తెలంగాణ జనాలు..
ఎందుకంటే అది మా సొమ్మే కదా ని..

మార్పు కోరుతారో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ కి
అధికారం ఇస్తారో సూడాలే...

...✍ కడారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్

మీ మాటల తూటాలను మాకు పంపండి...
మా 'జయభేరి అక్షర తుటా' తో జతవుతుంది.
+91 9391 544 889



2 లో

# నేడే కౌంటింగ్..
# అంతా సిద్ధం

రాష్ట్ర వ్యాప్తంగా 49 కౌంటింగ్ కేంద్రాలు.. అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి
మునుగోడులో అత్యధికంగా 91.5 శాతం పోలింగ్..
యాకుత్పురాలో అత్యల్పంగా 39.6 శాతం పోలింగ్.. ఉత్కంఠలో పార్టీలు, అభ్యర్థులు
బీఆర్ఎస్ మళ్లీ అధికారాన్ని దక్కించుకుంటామని ధీమా
కింగ్ మేకర్ అవుతామంటున్న బీజేపీ.. సీఎం సీట్ మాదే అంటున్న కాంగ్రెస్
కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

## కౌంటింగ్ కు అంతా రెడీ

కౌంటింగ్ కేంద్రాల దగ్గర మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 49 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్లో 14 చోట్ల కౌంటింగ్ జరుగుతుంది. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ పోస్టల్ ఓట్ల కౌంటింగ్.. ఎనిమిదిన్నర నుంచి ఈవీఎంల లెక్కింపు ఉంటుందని వికాస్ రాజ్ చెప్పారు. తెలంగాణలో మొత్తం 71.06శాతం పోలింగ్ జరిగిందన్నారు. మునుగోడు లో అత్యధికంగా 91.5 శాతం పోలింగ్ నమోదు కాగా.. యాకుత్పురాలో అత్యల్పంగా 39.6శాతం పోలింగ్ నమోదైనట్లు వికాస్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా రీపోలింగ్కు అవకాశం లేదని సీఈఓ తెలిపారు. ఆదివారం జరిగే కౌంటింగ్ కోసం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తెలంగాణ అంతటా పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని.. 3కోట్ల 26లక్షల ఓట్లు కాగా పురుషుల కంటే మహిళల ఓట్లు ఎక్కువ ఉన్నాయని వెల్లడించారు. దేవరకద్రలో 10మంది ఉన్నా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం ల మార్పిడి జరిగిందని.. ఆయా పార్టీ ఏజెంట్ల మధ్యనే స్ట్రాంగ్ రూమ్ కి తరలింపు జరిగిందని తెలిపారు. పోలింగ్ పై స్క్రూటినీ శుక్రవారం ఉదయం నుంచి జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని.. స్ట్రాంగ్ రూమ్ల వద్ద 40 కేంద్ర కంపెనీల బలగాలు భద్రతలో ఉన్నాయన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎక్కువ పోలింగ్ శాతం నమోదు అయిందన్నారు.లెక్కింపు జరిగిన కూడా మళ్ళీ రెండు సార్లు ఈవీఎం లు లెక్కిస్తారన్నారు. ప్రతీ రౌండ్ కు సమయం పడుతుంది.. ECI నిబంధనల ప్రకారం జరుగుతుందని వివరించారు. 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లతో కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. 8.30 నిమిషాల నుంచి ఈవీఎం ల లెక్కింపు ఉంటుందని.. ప్రతి టేబుల్ కు 5 గురు ఉంటారు.. కౌంటింగ్ కోసం పూర్తిగా సిద్ధం అవుతున్నమన్నారు.




2 లో



## ఐదు రాష్ట్రాల ఫలితాల తర్వాతే
## కాంగ్రెస్ ఫ్యూచర్ పై క్లారిటీ

✍ జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 2 :

దాదాపు 130 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ బీజేపీ వేవ్తో ఒక్కసారిగా నీరసపడిపోయింది. వరుసగా అన్ని చోట్లా అధికారం కోల్పోతూ వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఛత్తీస్గఢ్, రాజస్థాన్, కర్ణాటక మాత్రమే. మిగతా అన్ని చోట్లా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బీజేపీ హవానే కొనసాగుతోంది. వారసత్వ రాజకీయాలు అన్న మరక చెరుపుకునేందుకు ఎంత ప్రయత్నించినా అది సాధ్యపడడం లేదు. అందుకే అధ్యక్ష పదవిని మల్లికార్జున్ ఖర్గేకి అప్పగించి కొంత వరకూ తమపై ఉన్న ఆ మచ్చని తొలగించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. అయినా సరే...ఖర్గే ఓ కీలుబొమ్మ అని ప్రచారం చేస్తున్నాయి మిగతా పార్టీలు. ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎక్కడ పోటీ చేసినా చావోరేవో అని పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది ఆ పార్టీకి. ఇంత కష్టకాలంలో కాంగ్రెస్ని ఆదుకుంది కర్ణాటక. సౌత్లో బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఒకే ఒక రాష్ట్రాన్ని తమ ఖాతాలో వేసుకుంది. బీజేపీతో ప్రత్యక్ష యుద్ధం చేస్తున్న సమయంలో ఈ విజయం కాంగ్రెస్కి ఫుల్ కిక్ ఇచ్చింది. దాదాపు పట్టు కోల్పోతోందన్న సమయంలో కర్ణాటకను గెలుచుకోవడం సానుకూల సంకేతాలిచ్చింది. అధికారంలోకి వచ్చిన తరవాత పరిపాలన ఎలా ఉంది..? ఎంత వరకూ ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నది తరవాత సంగతి. ముందైతే ఆ అధికారం మిగతా 2 లో



## నేడు మద్యం దుకాణాలు బంద్

3 లో

## కింగ్ మేకర్
## అవుతామంటున్న బీజేపీ



✍ జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 2 :

అసెంబ్లీ ఎన్నికల్లో 18 నుంచి 22 సీట్ల వరకు గెలుస్తామని బీజేపీ నేతలు ఆశాభావంతో ఉన్నారు. పార్టీ బలంగా ఉన్న ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 10 నుంచి 12 సీట్లు గెలుస్తామని బీజేపీ నేతలు లెక్కలేసుకుంటున్నారు. అలాగే గ్రేటర్ పరిధిలో 4, రంగారెడ్డి, మిగతా 2 లో



## 4 నుంచి 22 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

◆ ఏడు బిల్లులను ప్రవేశపెట్టాలని యోచిస్తున్న కేంద్రం

✍ జయభేరి, న్యూ డిల్లీ, డిసెంబర్ 2 :

ఈ నెల 4 నుంచి 22 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాల్లో ఏడు బిల్లులను ప్రవేశ పెట్టాలని కేంద్రం యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. బిల్లుల్లో జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2023, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీ చట్టాలు (ప్రత్యేక నిబంధనలు) రెండవ (సవరణ) బిల్లుతో పాటు మరికొన్ని బిల్లులు ఉన్నట్లు తెలుస్తున్నది. జమ్మూ కాశ్మీర్, పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లతో సెషన్స్లోనే ప్రభుత్వం సభలో ప్రవేశ పెట్టే ఛాన్స్ ఉంది. నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ లాస్ (ప్రత్యేక నిబంధనలు) రెండో (సవరణ) బిల్లును సైతం ప్రవేశపెట్టనున్నది. చట్టం చెల్లుబాటును 2026 మిగతా 2 లో



## ధన్యవాదాలు

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం శ్రమించిన, సహకరించిన నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, అభిమానులు, శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు. గడచిన పదేళ్లుగా అడుగడుగునా అణచివేతలు, దాడులు, కేసులకు వెరవకుండా కాంగ్రెస్ చేసిన పోరాటంలో మీరంతా ప్రజల పక్షాన నిటారుగా, నికార్సుగా నిలబడ్డారు. మీ కష్టం, మీ శ్రమ వృథా కాలేదు. తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణలో మీ అందరి పాత్ర మరువలేనిది.
ప్రతి ఒక్కరికి అభినందనలు.

- మీ.. రేవంత్ రెడ్డి, TPCC

ప్రభాత జయభేరి
jayabheridaily.com

▶▶ మొదటిపేజీ తరువాయి

## కౌంటింగ్ కు అంతా సిద్ధం

ఓట్ల లెక్కింపు నుంచి ఎన్నికల ఫలితాల వెల్లడి వరకు బాధ్యత అంతా రిటర్నింగ్ అధికారి పైనే ఉంటుంది పార్టీ అభ్యర్థులు కౌంటింగ్ ఏజెంట్లు ఎలక్షన్ ఏజెంట్ల ను లెక్కింపు కేంద్రంలోకి అనుమతిస్తారు రిటర్నింగ్ అధికారి. ఒక్కో కౌంటింగ్ కేంద్రంలో 14 మందిని ఉంచకుండా కౌంటింగ్ ఏజెంట్లను అనుమతిస్తారు. ఈవీఎంలు ట్యాంపర్ కాలేదని దాని సీల్ సక్రమంగా ఉందని లెక్కింపు సిబ్బంది కౌంటింగ్ ఏజెంట్లు నిర్ధారించుకుంటారు. ఒకవేళ ఈవీఎంలు సక్రమంగా లేవని భావిస్తే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ప్రతి కౌంటింగ్ టేబుల్ మీద బ్లూ పాయింట్ పెన్ ఫారం 17 సి లోని పార్ట్ 2 పేపర్ ఉంచాలి. కౌంటింగ్ కు ముందు 17 సి ఫారం ఆధారంగా పోలైన ఓట్లు ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్లు సమానంగా ఉన్నాయో లేదో సరి చూసుకుంటారు. వాటిని నోట్ చేసుకోవడంతో పాటు వివిధ పార్టీల ఏజెంట్లకు కూడా చూపించి వారి సంతకాలు తీసుకుంటారు. ఆ తర్వాత ఈవీఎంల సీల్లు తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారు. అప్పుడు ఒక్కో అభ్యర్థికి ఆ ఈవీయంలో ఎన్ని ఓట్లు వచ్చాయో తెలుస్తోంది. ఆ గణాంకాలను నోట్ చేసుకుంటారు.ఒక్కో రౌండ్ లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్డుపై రాసి ప్రకటిస్తారు. ఇలా ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద సూపర్వైజర్, అసిస్టెంట్ సూపర్వైజర్, మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. ఈ లెక్కింపు ప్రక్రియ అంతా పార్టీల ప్రతినిధులు ఏజెంట్ల సమక్షంలోనే కొనసాగుతోంది. రౌండ్ ఫలితాన్ని వారు సంతృప్తి చెందిన తర్వాతే వెల్లడిస్తారు. ఎన్నికల సంఘం పరిశీలికుడు మాత్రమే కౌంటింగ్ కేంద్రం లోపల ఫోన్ వినియోగించుకోవడానికి అర్హులు.. మిగిలిన వారు ఫోన్ తీసుకెళ్లడానికి అనుమతి లేదు. ఇలా ఎన్నికల లెక్కింపును వీడియో తీసి వాటిని సీడీలలో భద్రపరుస్తారు. ఈ విధంగా భారీ భద్రత నడుమ కౌంటింగ్ కొనసాగనుంది.

## కాంగ్రెస్ ఫ్యూచర్ పై క్లారిటీ

సాధించుకోవడమే కీలకం. ఈ విషయంలో కాంగ్రెస్ సక్సెస్ అయింది. ఇదే సక్సెస్ ఫార్ములాని ఇకపైనా కొనసాగించాలని చూస్తోంది. ఇక్కడ మరో విషయం ముఖ్యంగా చెప్పుకోవాలి. దాదాపు ఏడాదిగా కాంగ్రెస్ పార్టీ చాలా యాక్టివ్గా కనిపిస్తోంది. అందుకు కారణం రాహుల్ గాంధీ. అంతకు ముందు రాహుల్ ప్రత్యక్ష రాజకీయాలపై పెద్దగా ఆసక్తి చూపించలేదన్న విమర్శలొచ్చాయి. కానీ...ఉన్నట్టుండి ఆయన తెరపైకి వచ్చారు. సీనియర్లందరూ రాజీనామాలు చేస్తున్న సమయంలోనే పూర్తి బాధ్యతలు తీసుకున్నారు. అసలు ఆయన వల్లే సీనియర్లు బయటకు వెళ్లిపోయారన్న వాదనలూ వినిపించాయి. కానీ రాహుల్ మాత్రం అవేవీ పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటూ వెళ్లారు. భారత్ జోడో యాత్రతో పార్టీ గ్రాఫ్ కొంత వరకూ పెంచగలిగారు. ఆ ప్రభావం కర్ణాటక ఎన్నికల ఫలితాలపై చాలా స్పష్టంగా కనిపించిందన్నది నిపుణుల విశ్లేషణ. ఇప్పుడు 5 రాష్ట్రాల ఎన్నికలు ఆ పార్టీకి మరో పరీక్ష పెట్టాయి. ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, తెలంగాణ, రాజస్థాన్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ 5 రాష్ట్రాల్లో ఛత్తీస్గఢ్, తెలంగాణలో కాంగ్రెస్కి కాస్త పాజిటివ్ వేవ్ కనిపిస్తోందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. రాజస్థాన్లో మాత్రం అధికారం కోల్పోయే అవకాశముందని అంచనా వేశాయి. మిజోరం సంగతి పక్కన పెడితే మిగతా నాలుగు రాష్ట్రాల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్లో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందన్నది ఎగ్జిట్ పోల్స్ అంచనా. అఫ్కోర్స్..ఫలితాలు వస్తే తప్ప ఈ అంచనాలు నిజమా కాదా అన్నది తేలదు. కానీ ఇప్పటికి జస్ట్ అనలైజ్ చేసుకోడానికి మాత్రం ఈ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు పనికొస్తాయి. 2024లోక్సభ ఎన్నికల ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కావడం వల్ల ఫోకస్ మరింత పెరిగింది. సింపుల్గా చెప్పాలంటే కాంగ్రెస్కి ఇవి సెమీ ఫైనల్స్ లాంటివి. ఈ ఎలక్షన్స్లో కాస్త గట్టిగా నిలబడితే కానీ లోక్సభ ఎన్నికలకు కొంత బూస్ట్ వస్తుంది. అన్ని ఫలితాలపైనా భారీ అంచనాలే పెట్టుకుంది కాంగ్రెస్ హైకమాండ్. కాకపోతే...మధ్యప్రదేశ్, రాజస్థాన్లో ఏ మేరకు రాణించగలుగుతుందన్నదే ఇక్క అత్యంత కీలకం. మధ్యప్రదేశ్లో కొంత వరకూ బీజేపీ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. అది కాంగ్రెస్కి ఏ మేరకు మేలు చేస్తుందన్నది చూడాలి. ఇక రాజస్థాన్లో కాంగ్రెస్ అంతర్గత కలహాలతో సతమతమైంది. ఈ కారణంగానే కొంత వరకూ నమ్మకం కోల్పోయిందన్నది పొలిటికల్ సర్కిల్లో వినిపిస్తున్న వాదన. 1998 నుంచి రాజస్థాన్ ఎలక్షన్ సినారియోని గమనిస్తే...కాంగ్రెస్ ఎప్పుడూ వరుసగా రెండోసారి అధికారంలోకి రాలేదు. ఈసారి గెలిస్తే మాత్రం అది సంచలనమే అవుతుంది. మధ్యప్రదేశ్లో షెడ్యూల్ తెగల జనాభా దాదాపు 21%గా ఉంది. అన్ని పార్టీల దృష్టి వీరిపైనే. అయితే...దేశంలో వెనకబడిన వర్గాలపై ఎక్కువగా దాడులు జరుగుతున్న రాష్ట్రంగా కొంత చెడ్డ పేరు తెచ్చుకుంది మధ్యప్రదేశ్. ఇది బీజేపీకి కొంత వరకూ నష్టం కలిగించే అవకాశముంది. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ గట్టిగానే ప్రచారం చేసింది. ప్రభుత్వ వ్యతిరేకతనే అస్త్రంగా మలుచుకుంది. కానీ ఈ అస్త్రం పని చేసిందా లేదా అన్నది తేలాలి. తెలంగాణలోనూ కాంగ్రెస్కి కొంత సానుకూలత ఉన్నట్టే కనిపిస్తోంది. కేంద్రంలోని బీజేపీ సర్కార్ని ఢీకొట్టేందుకు దాదాపు 24 విపక్ష పార్టీలు కలిసి ఇండియా కూటమి ఏర్పాటు చేశాయి. వీటిలో కాంగ్రెస్ కీలకంగా వ్యవహరిస్తోంది. బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అన్ని పార్టీలనూ సమన్వయం చేసుకునే బాధ్యతలు తీసుకున్నారు. కాంగ్రెస్ ఈ కూటమిని లీడ్ చేస్తుందని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఒకవేళ 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్కి సానుకూలంగా ఉంటే అప్పుడు ఈ కూటమి స్ట్రాటెజీ కూడా మారిపోయే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ ముందుండి మిగతా పార్టీలను నడిపించొచ్చు. కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగితే మిగతా పార్టీలూ విభేదాలు పక్కన పెట్టి పూర్తిస్థాయిలోఎన్డీయే పై పోరాడేందుకు సహకరించే అవకాశాలనూ కొట్టి పారేయలేం. ఫైనల్గా ఇది కాంగ్రెస్కే మేలు చేస్తుంది. లోక్సభ ఎన్నికలపైనా ఇది ప్రభావం చూపిస్తుంది. కాంగ్రెస్కి కావాల్సింది ఇదే. ఎదురే లేకుండా దూసుకుపోతున్న బీజేపీకి పగ్గాలు వేయాలని చూస్తోంది. ఒకవేళ లోక్సభ ఎన్నికల్లోనూ రాణించగలిగితే కేంద్రంలో బీజేపీకి ప్రత్యామ్నాయం తామే అని గట్టిగా ప్రచారం చేసుకోడానికీ అవకాశం వస్తుంది. ఆ అవకాశం ఈ సారే రావాలని ఆకాంక్షిస్తోంది కాంగ్రెస్ హైకమాండ్. ఇక 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్కి వ్యతిరేకంగా వస్తే ఇండియా కూటమి పరిస్థితేంటన్న ఆసక్తికర చర్చ కూడా జరుగుతోంది. అదే పరిస్థితి వస్తే కాంగ్రెస్ పార్టీకి కూటమి బాధ్యతలు అప్పగించేందుకు మిగతా పార్టీలు అంగీకరిస్తాయా లేదా అన్నదీ అనుమానమే. అప్పుడు ఎన్డీయే మరింత బలపడుతుంది. ప్రజలకు బీజేపీ తప్ప మరో ఆప్షన్ లేదన్న సంకేతాలూ వెళ్తాయి. ఇది ఆ కూటమిలోని అన్ని పార్టీలకూ నష్టం కలిగించే ప్రమాదముంది. అందుకే...చివరి వరకూ ఈ కూటమి చీలకుండా ఉంటుందా అన్నదీ ఈ 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు డిసైడ్ చేస్తాయన్నది కొందరి అనాలసిస్.

## కింగ్ మేకర్

వరంగల్, మెదక్ జిల్లాల్లో ఒక్కొక్క సీటు గెలుపుపై ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కేంద్రంగా ఏపీ పోలీస్ వర్సెస్ తెలంగాణ పోలీస్ క్షేత్రస్థాయి సమాచారం, పార్టీ నాయకుల నుంచి సేకరించిన వివరాల ప్రకారం బీజేపీ ముఖ్య నేతలు పార్టీ గెలిచే స్థానాలపై ఓ అంచనాకు వచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్లతో బీజేపీ ముఖాముఖిగా పోటీపడుతున్న సీట్లతో పాటు, ఈ మూడుపార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న నియోజకవర్గాల్లో కొన్నిచోట్ల అనూహ్య ఫలితాలు వస్తాయని గట్టిగా నమ్ముతున్నారు. కనీసం 25 నుంచి 30 సీట్లలో గట్టి పోటీనివ్వడంతో పాటు, పార్టీ బలంగా ఉన్న చోట్ల ఓటింగ్ శాతం పెరగడం ద్వారా.. 15 నుంచి 20 శాతం దాకా బీజేపీ ఓటింగ్ శాతం నమోదు చేస్తుందని విశ్వసిస్తున్నారు. అభ్యర్థులు పోటీ చేసిన 111 నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరగడం, ఇతర సానుకూల అంశాలపై బీజేపీ నేతలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రేపు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అధికారికంగా వెలువడ్డాక వాస్తవ పరిస్థితిని బేరీజు వేయాల్సి ఉంటుందని పార్టీ ముఖ్యనేతలు చెబుతున్నారు.


## పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

డిసెంబర్ 31 వరకు పొడిగించాలని కోరింది. తాతాల్కిలిక పన్నుల సేకరణ బిల్లు 2023, కేంద్ర వస్తువులు సేవల పన్నులు (రెండో సవరణ) బిల్లు, సెంట్రల్ యూనివర్సిటీ (సవరణ) బిల్లు, తెలంగాణలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, బాయిలర్స్ బిల్లు సైతం పార్లమెంట్ ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. వీటితో పాటు ఐపీసీ, సీఆర్పీసీ, ఎవిడెన్స్ యాక్ట్లను ఆమోదం కోసం పార్లమెంట్ ముందుకు తీసుకు వచ్చే ఛాన్స్ కనిపిస్తుంది.ప్రస్తుతం పెండింగ్లో 37 బిల్లు ఉండగా.. 12 వరకు చర్చించనున్నట్లు సమాచారం. ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లుపై చర్చించనున్నట్లు తెలుస్తున్నది. అయితే, ఈ బిల్లులోని కొన్ని నిబంధనలను ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా 'కఠోరమైంది'గా పేర్కొంది. ఆగస్టులో వర్షాకాల సమావేశాల సందర్భంగా రాజ్యసభలో ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటుతో ఆమోదించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకం.. వేతనం, తొలగింపుపై కేంద్రానికి నియంత్రణను ఇచ్చే ప్రధాన ఎన్నికల కమిషనర్ మరియు ఇతర ఎన్నికల కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు మరియు పదవీకాలం) బిల్లుపై సైతం పార్లమెంట్లో చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్

# నేడే కౌంటింగ్.. గెలుపెవరిది..!?

తెలంగాణ సార్వత్రిక ఎన్నికలకు ముగింపు దశకు చేరుకుంది.. ఓటింగ్ శాతం ఇప్పటికే నమోదు ఇవ్వడం వల్ల కౌంటింగ్ కూడా ప్రారంభం కానుంది.. తెలంగాణలో కారు జోరెంత!? చేతి బలమెంత!? దమ్ము ధైర్యం చూపేదెవరు!? దుమ్ము దులిపేదెవరు!? ఇప్పటికే కర్ణాటకను ఉప ముఖ్యమంత్రి దీనికి శివకుమార్ హైదరాబాద్ చేరుకొని తాజ్ కృష్ణలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు... ఈ నేపథ్యంలో 'జయభేరి' కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ విశ్లేషణ...




✍ జయభేరి, హైదరాబాద్ :

2023 ఎలక్షన్లో తెలంగాణ రాష్ట్రంలో పెను మార్పులకు దారి తీస్తోంది. నిజానికి ముచ్చటగా మూడవసారి తెలంగాణ రాష్ట్రంలో అధికారం దక్కించుకోవాలని ఉద్దేశంతో అధికార బి ఆర్ ఎస్ పార్టీ చాలా శ్రమించిన ఫలితం మాత్రం ప్రశ్నార్థకంగానే మిగిలిపోయింది.. కారణం ఆయన నియోజకవర్గాల్లో ఉన్న ఎమ్మెల్యేల పని తీరుకు నిదర్శనం.. అక్రమార్కుల్లాగా మారుతున్నారని పలు దఫాలుగా కేసీఆర్ కి ఎన్నో రిపోర్టు వచ్చిన కేవలం సిట్టింగులకి మళ్లీ టికెట్ ఇవ్వడం తన మగతనం అనుకున్న కేసీఆర్ కి పరాభవం మిగలనుంది!? అయితే ఇక్కడ మనం ఒకటి అర్థం చేసుకోవాలి.

**2014 ఎన్నికల్లో ఆనాటి టిఆర్ఎస్ పార్టీ బాధ్యతహితంగా పనిచేసిన 2018లో అహంకార పూరిత స్వభావంతో పనిచేసిన ఆరోపణలు గట్టిగా వినిపించాయి.. నిజానికి 2023 ఎలక్షన్లు ఉద్యమ పోరాట స్ఫూర్తితో జరిగాయంటే అతిశక్తి కాదు. ఈసారి ఎన్నికల్లో కొత్తగా వచ్చిన ఓటర్ల సంఖ్య ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో మొగ్గు చూపింది... దీని ద్వారా అధిక శాతం ఓటింగ్ ఆయా నియోజకవర్గాల్లో జరిగింది కానీ నగరాల్లో మాత్రం పూర్తిగా 30%మించి ఓటింగ్ నమోదు దాటలేదు.. అంటే దీని ఉద్దేశం భాగ్యనగరంలో ఓటింగ్ కు దూరంగా ఉన్న ఓటర్లు తమ నిరసన వ్యక్తం చేసినట్టుగా స్పష్టమవుతుంది.. పడిన ఓటింగ్ శాతం పూర్తిగా కాంగ్రెస్ వైపై మగ్గుచూపుతుంది అని అనేక జాతీయ రాష్ట్ర ఎగ్జిట్ పోల్ వివరిస్తున్నప్పటికీ వీటన్నింటిని తూచ్ అని కొట్టు పారేశారు కల్వకుంట్ల తారక రామారావు... సరే ఎలాగూ ఈరోజు కౌంటింగ్ మొదలైంది కాబట్టి మధ్యాహ్నం మూడు నాలుగు గంటలకల్లా రాజకీయ నేతల భవితవ్యం ప్రజల మనోభీష్టం నెరవేరే సమయం కాబట్టి పూర్తిగా అధికారం ప్రజలు ఎవరికి కట్టబెట్టారో అర్థం అయిపోతుంది...**

ఇదిలా ఉంటే ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పూర్తిగా రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్రాజ్ పూర్తిగా అవినీతిపరుడయ్యాడని కెసిఆర్ అధికారులను కొనేశాడని ఈవీఎంలను మార్చే ప్రయత్నం చేస్తున్నాడని ఎన్నికలను రద్దు చేయాలని సంచలన కామెంట్ చేశాడు.. ఇది వినడానికి జోక్ మాదిరిగానే ఉన్న నిజం కాక మానదు. ఎందుకంటే వికాస్ రాజు పై వస్తున్న అనుమానాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయి.. ఎన్నికల కమిషన్ కేవలం వాగ్దానాలకే పరిమితమైపోయిందని ఎక్కడబడితే అక్కడ డబ్బులు పంపకం జరుగుతున్న పట్టించుకోకుండా తూతు మంత్రంగా పనిచేశారని చెబుతున్నప్పటికీ మరి పట్టుబడ్డ వేలకోట్ల ధనం ఎక్కడికి వెళ్లిందో ఇంతవరకు లెక్కలేదు.. పోలింగ్ నమోదైన ఈవీఎంలు వాటిని పటిష్ట భద్రత నడుమ కేంద్ర బలగాలు రక్షణగా ఉండి మూడంచెల భద్రతతో కాపాడుతున్నప్పటికీ రాష్ట్ర అధికార యంత్రంతో అధికార పార్టీ మమేకమై వికాస్ రాసిన తమ గుప్పిట్లో పెట్టుకుని ఈవీఎంలను మార్చే ప్రయత్నంలో ఉన్నారనే అనుమానాలతోనే కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేయడం అలాగే కోట్ల నిధులు మళ్లిస్తున్నారు.

**ఈ ప్రభుత్వం పై చర్య తీసుకుని కట్టడి చేయాలని ఎలాంటి తొందరపాటు నిర్ణయాలకు పోకుండా ఆపాలని ఇప్పటికే రాష్ట్ర పీసీసీ అధ్యక్షులతో సహా పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు.. దీన్ని బట్టి చూస్తే కెసిఆర్ ఇప్పటికే తన ప్లాన్ అమలు చేశాడనే మనకు అర్థం అయిపోతుంది.. వాస్తవానికి బిజెపి బీఆర్ఎస్ లు రెండు కుమ్మక్కైపోయి అటు ఎంఐఎం ను ఆధీనంలో పెట్టుకొని తిరిగి రాష్ట్రంలో అధికార పార్టీ ముచ్చటగా మూడవసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ని చూడాలని విశ్వ ప్రయత్నాలను చేస్తున్నారట... చేసేదేం లేక ప్రజాభీష్టాన్ని కాదనలేక ఒకే ఒక అవకాశం...అదే ఈవీఎంలను మార్చడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంటుంది.. ఇదే కనుక జరిగితే ప్రజాస్వామ్యం కూని అవ్వక తప్పదు. ఇక భారత దేశంలో ఎన్నికలకు విలువే ఉండదనేది విజ్ఞుల అభిప్రాయం... అంతేకాదు ఎన్నికల కోడ్ అమలు సమయంలో వేల కోట్ల రూపాయలను ఎన్నికల కమిషన్ ఏం చేసింది!? ఆ డబ్బును దారాదత్తంగా ఎవరికి కట్టబెట్టింది!? ప్రముఖ ఐఏఎస్ ఇంట్లో జరిగిన ఇన్కమ్ టాక్స్ సోదాలో దొరికిన డబ్బు ఎంత!? ఆ డబ్బు ఎటువైపు మళ్ళింది!? ఇలాంటి ఎన్నో సందేహాలను ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ లేవనెత్తారు... ఇక తెలంగాణ కోడలు షర్మిల తెలంగాణ ప్రజల మార్పు కోసమే కేసీఆర్ ఓటమి కోసమే నేను తెలంగాణ ప్రజలకు త్యాగం చేశానని చెప్పుకోవడం అంత సెంటిమెంటుని రగిలించే ప్రయత్నం చేసింది... తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పీడ విరగడైపోతుందని అందుకోసమే ప్రార్థిస్తున్నాను అని చెప్పడం తెలంగాణ ప్రజలు స్వీకరిస్తారా!?**

ఇదిలా ఉంటే ఇంకో వైపు కొంత మీడియా కేసీఆర్ ఇప్పటికే ప్రగతిభవన్ కాళీ చేస్తున్నాడని సామాన్లు సదురుకుంటున్నాడని అక్కడి సిబ్బందికి కృతజ్ఞతలు చెబుతున్నాడని అనేక ఊహగానాలు ఆయా మీడియా కథనాలు వెలుబడడం బీఆర్ఎస్ శ్రేణులకు ఒకంత కలవరాన్ని పుట్టిస్తుంది... కెసిఆర్ అంత ఆషామాషీ మనిషి ఏం కాదు. అంతకంటే అపర చానుక్యుడు రాజకీయ చతురత కలిగిన జనార్షణ కలిగిన నేత.. అలాంటి ముఖ్యమంత్రి ఒక్కసారిగా అలాంటి నిర్ణయం తీసుకోడు చివరి వరకు పోరాడే తత్వం గల కెసిఆర్ రిజల్ట్ వచ్చిన తరువాత తమకు వచ్చిన బలాబలాలను పరీక్షించి అవసరమైతే ఎమ్మెల్యేలను వందల కోట్ల రూపాయలతో కొనే సత్తగల ముఖ్యమంత్రి కేసీఆర్... కెసిఆర్ ఇలాంటి వాడనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే కాంగ్రెస్ నుంచి గెలిచే ఎమ్మెల్యే అభ్యర్థులను కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆధ్వర్యంలో బెంగళూరుకు షిఫ్ట్ చేసే పనిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారట... అందుగ్గాను ఇప్పటికే డీకే శివ కుమార్ హైదరాబాదుకు చేరుకొని ఒక హోటల్లో గెలుపొందే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రావాలని ఆదేశం చేశారు.. చేతి బలాన్ని చూపిస్తారో, చూడాలి.

**ఒకందుకు ఇది మంచిదే అయిన గెలిచిన కాంగ్రెస్ నేతలు బి ఆర్ ఎస్ లోకి రాకుండా ఉంచ గలరా!? కెసిఆర్ మా తండ్రి మా గురువు మా దైవం మా రాజకీయ పితామహుడు అని చెప్పిన ఆ నేతలు కాంగ్రెస్ నుంచి టికెట్ తీసుకొని గెలిచి తిరిగి సొంత గూటికి రారనే నమ్మకం తెలంగాణ కాంగ్రెస్ వాళ్ళకి కలిగిందా!? తెలంగాణ సమాజానికైతే ఆ నమ్మకం లేదు.. కచ్చితంగా కేసీఆర్ వదిలిన బాణాలు వీళ్లు అనే మాటలు అనటం వినపడుతున్నాయి... మొత్తానికి తెలంగాణ శాసనసభ ఎన్నికలు ఘట్టం ఇక ముగిసినట్టే... ఈరోజుతో వచ్చే ఫలితాలను పట్టి ఏకంగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు అవుతుందా!? లేదా ముచ్చటగా మూడవసారి అధికార పగ్గాలు అధికార పార్టీ చేపడుతుందా అనే సందేహాలకు ఇక పడనుంది. చివరి క్షణంలో ఏమైనా జరగవచ్చు ఎందుకంటే అవి బ్యాలెట్ బాక్స్ లు ఈవీఎం మిషిన్లు కాబట్టి ఏమైనా జరగొచ్చు!**



...✍ కడారి శ్రీనివాస్
సీనియర్ రాజకీయ విశ్లేషకులు
9848 962 799

ఏమో గుర్రం ఎగరవచ్చు ఎవరికి తెలుసు చివరి క్షణంలో తారుమారు కూడా కావచ్చు.... అని ఇప్పటికే బీఆర్ఎస్ రాజకీయ చతురతలు తెలిసిన వాళ్ళు కొందరు రాజకీయ నేతలు అభిప్రాయపడుతున్నారు... ఆ భయంతోనే కాంగ్రెస్ నేతలు ఇప్పటికే అలా జరగకుండా ఈసీకి ఫిర్యాదు చేస్తూ మీడియా ముందు అనేక అనుమానాలు లేవనెత్తుతున్నారు... కాంగ్రెస్ గెలుస్తుందని నమ్మకంతో ఇప్పటికే రేవంత్ రెడ్డి ఇంటి చుట్టూ నాయకుల తాకిడి అభిమానులు తాకిడి కార్యకర్తలు తాకిడి ఎక్కువైపోయింది... ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కొస్తే ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి అవుతాడనే నమ్మకం నాకుంది అంటూ బండ్ల గణేష్ సంచలన కామెంట్ చేయడం దీని ద్వారా మిగతా సీనియర్ నాయకులు విభేదాలు కలగడం రానున్న రోజుల్లో మనం చూడొచ్చు... అధికారం దక్కించుకోవడానికి 80 సీట్లు సింగిల్ పార్టీ చేపడితే కనుక తిరుగులేని అధికారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే దిశగా కాంగ్రెస్ అడుగులు వెయ్యొచ్చు... కానీ 45, 50 సీట్లు వస్తే గనక అధికారం చేతికిచ్చుకోవాలి అంటే చాలా కష్టపడాలి... అదే అధికారం బీ ఆర్ఎస్ పార్టీ అయితే ఏకంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి వెనుక అడిగే వేయదు.. ఏదేమైనా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్ సరళిని పట్టి చూస్తే యువత కొత్తగా వచ్చిన ఓటు హక్కును వినియోగించుకున్న వాళ్లు ఎక్కువగా ఓటు వేయడం అది అధికార ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అధికార ప్రభుత్వంపై నిరసనను తెలియజేయడం కాంగ్రెస్కు పాజిటివ్ గా మారిపోయింది.. అందుకే పోస్టల్ బ్యాలెట్ లో ఉన్న అవి కూడా పూర్తిగా కాంగ్రెస్కే పడుతున్నాయని సంకేతాలు వినపడడంతో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపడుతుందనీ అనడంలో ఎలాంటి సందేహం లేదు.. లేదు కాదు కూడదు అని అంటే కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ మరొక్కసారి ముచ్చటగా మూడోసారి అధికారం చేసి తీర్చుకోవడానికి ఎంతటి కార్యానికైనా వెను దీయదు... ఈసారి 2023 ఎలక్షన్లు ప్రజలు మరి ఎవరికి పట్టం కట్టిపెట్టారో మరికొద్ది గంటల్లో తెలియనుంది. ఎగ్జిట్ పోల్ సంకేతాలు ఎన్ని ఉన్నా అవన్నీ పక్కనపెట్టి ప్రజా నిర్ణయానికి కట్టుబడి ఉండాలి వచ్చిన ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేయాలి... కొత్తగా ఏర్పడే ప్రభుత్వం ఏదైనా ప్రజా ఆమోదయోగ్యంగా జరగాలని ప్రజాపిష్టానికి పరిపాలన కొనసాగించాలి. కొత్తగా ఏర్పాటు అయిన తెలంగాణ శాసనసభలు ఎవరు కూర్చొని శాసనాలు చేస్తారో!? ఎవరి లెక్కలు ఎంతెంతో తేల్చే తరుణమిదే....!



# కౌంటింగ్ కు పటిష్ఠ ఏర్పాట్లు

- నేడు ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



**జయభేరి, డిసెంబర్ 2 :**

జిల్లాలో 3న జరిగే ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టామని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం కీసరలోని బోగారం హోలీమేరి ఇంజనీరింగ్ కాలేజీలో ఐదు నియోజక వర్గాల స్ట్రాంగ్ రూమ్స్ తో పాటు కౌంటింగ్ హాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కౌంటింగ్ రోజున ఐదునియాజక వర్గాలకి 2439 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం రౌండ్స్105 కి, కౌంటింగ్, కి ,116, టేబుల్స్ కి ఏర్పాటు చేసి ప్రతి టేబుల్ కి మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్వైజర్ లు, కౌంటింగ్ అసిస్టెంట్లు అలాగే పార్టీ ఏజెంట్ల తో పాటు మంది రెవెన్యూ సిబ్బంది ఉంటారని తెలిపారు. కౌంటింగ్ రోజున నిఘా నీడలో పటిష్ఠ భద్రత కల్పిస్తున్నామని అన్నారు.

- **(43)మేడ్చల్ :** 584 పోలింగ్ కేంద్రాలు, 21 రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్ 28, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్04.
- **(44) మల్కాజ్గిరి :** 429 పోలింగ్ కేంద్రాలు, 21 రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్ 20, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్02.
- **(45) కుత్బుల్లాపూర్:** 590 పోలింగ్ కేంద్రాలు, 21 రౌండ్స్, కి కౌంటింగ్ టేబుల్స్ 28, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్02.
- **(46) కూకట్ పల్లి :** 418 పోలింగ్ కేంద్రాలు, 21రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్ 20, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్01.
- **(47) ఉప్పల్ :** 418 పోలింగ్ కేంద్రాలు, 21 రౌండ్స్ కౌంటింగ్ టేబుల్స్ 20, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్02.

ఈసారి పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈవీఎంల కౌంటింగ్ పూర్తయ్యేలోపు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తిచేయాలని నిర్ణయించారు. ఒకవేళ ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలోగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తికాకుంటే, చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపును నిలిపేసి పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు.
ఆ తర్వాతే చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపు చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈసారి ఐదు నియోజకవర్గాలకుగాను దాదాపు 9889, పోస్టల్ బ్యాలెట్లు వినియోగిచు కొన్నారు. అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు.



## గ్రామ సర్పంచ్.. కార్యదర్శి అక్రమాలకు పాల్పడుతున్నాడు

- గ్రామ సర్పంచ్ గ్రామ కార్యదర్శి అక్రమ కట్టడాలకు వత్తాసు పలుకుతున్నారు.. ఎంపిటిసి అశోక్ రెడ్డి

**జయభేరి, డిసెంబర్ 2:**

గ్రామ కంఠం భూములు కబ్జా అవుతున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు కూడా అక్రమార్కులకు అండగా ఉండడంతో వారు ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. శామిర్పెట్ మండలం మజీద్ పూర్ లో గ్రామ పంచాయతీకి సంబంధించిన భూములను గ్రామ సర్పంచ్ గ్రామ కార్యదర్శి కలసి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతూ గ్రామపంచాయతీ ఆదాయానికి గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్నారని గ్రామ ఎంపీటీసీ అశోక్ రెడ్డి ఆరోపించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 40లో దాదాపు 200 గజాల స్థలాన్ని ప్రయివేటు వ్యక్తికి దారాదాత్తమ్ చేశారని అశోక్ రెడ్డి ఆరోపించారు. గతంలో కూడా గ్రామంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్న విషయాన్ని గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకువడం లేదన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతధికారులను కోరారు. గ్రామ కంటానికి చెందిన 5 గుంటల భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఎంపీటీసీ అశోక్ రెడ్డి అధికారులను కోరారు.

## గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్..

- 178 మంది పాలస్తీనా ప్రజల మృతి

**జయభేరి, గాజా, డిసెంబర్ 2**

హమాస్తో ఏడు రోజుల కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన వెంటనే గాజాపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. హమాస్ను తుదముట్టించేంత వరకు యుద్ధాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆపేది లేదన్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమెన్ నెతన్యాహూ మాటలను నిజంచేస్తూ.. ఆ దేశ సైన్యం గాజా స్ట్రిప్పై బాంబుల వర్షం కురించింది. దీంతో కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 178 మంది పాలస్తీనా ప్రజలు మరణించినట్లు గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. పెద్ద సంఖ్యలో పౌరులు గాయపడినట్లు తెలిపింది. ఈ దాడులతో గాజాలో మళ్లీ ఆసుపత్రుల్లో దారుణపరిస్థితులు ఏర్పడుతాయని ఐక్యరాజ్య సమితికి చెందిన పలు సంస్థలు హెచ్చరికలు జారీ చేశాయి.ఇజ్రాయెల్హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అక్టోబర్ 24న జరిగింది. మొదట నాలుగు రోజులే ఒప్పందం చేసుకున్నప్పటికీ, తర్వాత బందీల విడుదల కోసం మరో మూడు రోజులు పెంచారు. దీంతో ఇరువైపుల నుంచి దాడులు జరగలేదు. ఈ ఏడు రోజుల్లో గాజాకు మానవాతా సాయం అందడంతోపాటు ఇరుపక్షాల మధ్య బందీల విడుదల జరిగింది. అయితే గడువు శుక్రవారం ఉదయంతో ముగియడంతో కాల్పుల విరమణను ఇంకొన్నిరోజులపాటు కొనసాగించాలని అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి వచ్చినప్పటికీ కాల్పులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో గాజాలో మరోసారి మారణహోహం కొనసాగుతున్నది.



## కాంగ్రెస్ అభ్యర్థులకు హైకమాండ్ అలర్ట్

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 2 :**

తెలంగాణ ఎన్నికల ఫలితాలు వెలవడనున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ముందుగా బ్యాలెట్ ఓట్ల లెక్కింపు తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంలలో నమోదైన ఓట్ల లెక్కింపు కొనసాగనుంది. అయితే, ఎగ్జిట్ పోల్స్ అన్ని పార్టీల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య హోరాహోరి ఫైట్ జరగుతుందని.. హంగ్ వచ్చే అవకాశముందని కొన్ని సర్వేలు చెప్పగా.. మరికొన్ని సర్వేలు కాంగ్రెస్ దే పై చేయి ఉంటుందని ప్రకటించాయి. అయితే, కాంగ్రెస్ గెలుస్తుందన్న ఊహాగానాల మధ్య కాంగ్రెస్ హై కమాండ్ అప్రమత్తం అయింది. గెలిచిన ఎమ్మెల్యేలు చేజారకుండా ఉండేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి చాలా పకడ్బందీగా వ్యవహరించేందుకు సమాయత్తమవుతోంది. తమ పార్టీ అధికారంలోకి వస్తుందని గట్టిగా నమ్ముతున్న కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో పరిస్థితిని పరిశీలించేందుకు కాంగ్రెస్ హైకమాండ్ కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ను హైదరాబాద్కు పంపిస్తోంది. సాయంత్రం వరకు డీకే శివకుమార్ హైదరాబాద్ కు రానున్నారు. ఇప్పటికే అభ్యర్థులకు కాంగ్రెస్ పార్టీ పలు సూచనలు చేసింది.. గెలిచిన అభ్యర్థులు ఆదివారం సాయంత్రం హైదరాబాద్ కు రావాలని ఆదేశించింది.అంతేకాకుండా.. తెలంగాణకు ఏఐసీసీ పెద్దలను కూడా రంగంలోకి దింపింది హైకమాండ్.. ఏఐసీసీ పరిశీలకులు తెలంగాణకు రానున్నారు. తెలంగాణ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో చిదంబరం, సుశీల్ కుమార్ షిండే, సూర్జేవాలాకు టీకాంగ్రెస్ వ్యవహారాల బాధ్యతలను అప్పగించింది. ఉదయాన్నే చిదంబరం, షిండే, సూర్జేవాలా హైదరాబాద్కు రానున్నారు. ఏఐసీసీ పెద్దలు ఎన్నికల ఫలితాలపై పరిశీలన జరపడంతోపాటు గెలిచిన అభ్యర్థులకు పలు సూచనలు చేయనున్నారు. అంతేకాకుండా.. హైదరాబాద్ వచ్చిన ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు.

## ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

**జయభేరి, డిసెంబర్ 2:**



మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి ఎన్నికల నిబంధనల ప్రకారం కౌంటింగ్ సిబ్బందికి సంబంధించిన ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరములో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, అమన్ మిట్టల్, కౌంటింగ్ ప్రత్యక అబ్జర్వర్లు కూకట్ పల్లి కి హిమన్షు వర్మ, ఉప్పల్ కి దశరథ్ దెబ్బర్మ, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ సిబంది సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు శాసనసభ నియోజక వర్గాలకు సంబంధించి మొత్తం 2439 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 508 కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. అందులో కౌంటింగ్ పర్యవేక్షకులు, 161 మంది కౌంటింగ్ అసిస్టెంట్స్, 177, మంది మైక్రో అబ్జర్వర్లలు, 170 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులతో పాటు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాపీ కార్మికుడికి ఆర్థిక సహాయం అందజేత

**జయభేరి, బాపట్ల:**



పేదరికన్ని అనుభవిస్తూ శ్రమే ఆయుధంగా మలుచుకుని తాపీ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటు అనారోగ్య పాలై పేదరికం అనుభవిస్తున్న తాపీ కార్మికుడు బొద్దు దిలీప్ కు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందని ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బంౘ్రెడ్డి గోపి అన్నారు.బాపట్ల పట్టణం తొవ్వ కాలువ వద్ద మున్నవారిపాలెం రహదారిలో రోడ్డు వెంబడి నివస్తున్న తాపీ కార్మికుడు బొద్దు దిలీప్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంకు గురి కావడంతో ఆర్గనైజేషన్ అధ్వర్యంలో రూ 5వేలు ఆర్థిక సహాయంను శనివారం సభ్యులు అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు బంౘ్రెడ్డి గోపి మాట్లాడుతూ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న దిలీప్ రోడ్డు ప్రమాదాన్ని గురై వైద్యశాలలో చికిత్స అనంతరం కూడా కొలుకొకపోవడంతో పాటు, కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందన్నారు. క్షతగాత్రుడి బంధువుల ద్వారా తమకు సమాచారం అందడంతో బాధితులకు ఆర్గనైజేషన్ సభ్యుల సహాయ సహకారాలతో సభ్యుల నిర్ణయం మేరకు కొంత ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. క్షతగాత్రుడుకు మెరుగైన వైద్యం అందించుకునేందుకు దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల సురేష్, ట్రెజరర్ జోగి సువర్ణ రాజు, సభ్యులు చల్లా శ్రీనివాసరావు, తన్నీరు గోపి, యశం రాజా రమేష్, బీమా కోటేశ్వరరావు, నరాలశెట్టి నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీలు.. వేడుకలపై నిషేదం

**జయభేరి, మేడిపల్లి :**



తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్ననందున మేడిపల్లి పోలీస్ స్టేషన్ (రాచకొండ పరిధి)లో ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు కానీ.. మరే ఇతర రాజకీయ వేడుకలను ఎట్టి పరిస్థితుల్లోనూ జరపరాదు. బాణ సంచా పేల్చకూడదు. DJ సౌండ్/ ఇతర బ్యాండ్ సౌండ్స్ చేయరాదు. ఎటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారాదు. బైక్ ర్యాలీలు , ఇతర ఏ ర్యాలీ కూడా చేపట్టరాదు.
గుంపులు గుంపులుగా తిరగరాదు. గెలిచిన పార్టీ అభ్యర్థులు , అభిమానులు , పార్టీ కార్యకర్తలు విజ్ఞత పాటించాలి. ఓటమి చెందిన పార్టీ అభ్యర్దుల, కార్యకర్తల, అభిమానుల ఇళ్ళ ముందు ఎటువంటి కవ్వింపు చర్యలు (అపహాస్యం, రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం, అవహేళన చేయడం) చేయరాదు. సామాజిక మాధ్యమాల్లో ఎటువంటి అభ్యంతర కరమైన పోస్టులు పెట్టరాదు. పోటీలో గెలుపు ఓటమి సహజం. ఏది జరిగినా మంచికే అనే విషయన్ని గుర్తుపెట్టుకొని ప్రవర్తించాలి. ఎటువంటి మానసిక ఒత్తిడికి లోను కారాదు. మీ చర్యల వల్ల ఎవరికి శత్రువు కాకూడదు. గెలిచే అభ్యర్థులకు ముందుగా శుభాకాంక్షలు. పోటీలో ప్రయత్నం చేస్తే కచ్చితంగా ఏదో ఒక రోజు విజయం మీదే అంటున్న.. సైదులు, ఇన్స్పెక్టర్, మేడిపల్లి పోలీస్ స్టేషన్, సిబ్బంది.

## దర్గాల్లో బిఎల్ఆర్ ప్రత్యేక ప్రార్ధనలు



**జయభేరి, ఉప్పల్ :**

నాంపల్లి దర్గాల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన ఉప్పల్ టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.
నాంపల్లిలోని యూసుఫిన్ దర్గాలో నియోజకవర్గంలోని మైనారిటీ నాయకులతో కలిసి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి.. జరగబోయే ఎన్నికల ఫలితాలలో ఉప్పల్ నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందాలని కోరడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఇర్ఫాన్ (ఉప్పల్ ఖాన్), మక్బూల్, సయ్యద్ షేక్, రఫీక్, నజీర్, ఖాదర్, జియా అక్రమ్, హాజీ ముధసీర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.




## నేడు మద్యం దుకాణాలు బంద్

- 144 సెక్షన్ విధించిన పోలీసు అధికారులు

**జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 02 :**

తెలంగాణలో రేపు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సెక్షన్ 144 విధించారు. మద్యం అమ్మకాలపై కూడా నిషేధం విధించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. గ్రేటర్ పరిధిలోని మూడు కమిషనరేట్ల సీపీలు సందీప్ శాండిల్య, స్టీఫెన్ రవీంద్ర, డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటింగ్ సెంటర్ల వద్ద బహిరంగ ప్రదేశాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఐదుగురి కంటే ఎక్కవ మంది గుమి కూడొద్దని, వీధుల్లో బాణసంచా కాల్చొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు.



## నాంపల్లి దర్గాల్లో ప్రత్యేక ప్రార్ధనలు

**జయభేరి, ఉప్పల్ :**

నాంపల్లి దర్గాల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన ఉప్పల్ టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. నాంపల్లిలోని యూసుఫిన్ దర్గాలో నియోజకవర్గంలోని మైనారిటీ నాయకులతో కలిసి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి.. జరగబోయే ఎన్నికల ఫలితాలలో ఉప్పల్ నియోజకవర్గం నుండి టిఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపొందాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు బద్రుద్దీన్, రాష్ట్ర నాయకులు కటార్ల భాస్కర్, గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్, ఇర్ఫాన్, మహబూబ్ బాల్రెడ్డి, రాజిరెడ్డి, మక్బూల్, సయ్యద్ షేక్, రఫీక్, నజీర్, ఖాదర్, జియా అక్రమ్, హాజీ ముధసీర్ గౌస్, కోటి తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి భవన్ లో ముఖ్యమంత్రి కేసీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఉప్పల్ నియోజకవర్గానికి కాబోయే ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇంఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి.

జయభేరి, ఉప్పల్


జయభేరి
సినిమా

# ది అన్టోల్డ్ స్టోరీ
## సిల్క్ స్మితగా చంద్రిక రవి



80, 90వ దశకాల్లో గ్లామరస్ తారగా వెలుగొందారు సిల్క్ స్మిత. గ్లామరస్ పాత్రలు, పాటల్లో మెరిసిన ఆమె పీక్ పీరియడ్లో బిగ్గెస్ట్ క్రౌడ్‌పుల్లర్ గా అలరించారు. సిల్క్ స్మిత అసలు పేరు వడ్లపాటి విజయలక్ష్మి. ఆమె జయంతి పురస్కరించుకొని సిల్క్ స్మిత బయోపిక్ను అనౌన్స్ చేశారు దర్శకుడు జయరామ్. ఇటీవల 'వీరసింహారెడ్డి' సినిమాలోని స్పెషల్ సాంగ్లో అలరించిన చంద్రిక రవి సిల్క్ స్మిత క్యారెక్టర్ చేస్తున్నారు. ఎస్టిఆర్ఐ సినిమాస్ పై ఎస్ బి విజయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా వి. మహాస్త్రీ అమృతరాజ్ సమర్పిస్తారు .ఈ ప్రత్యేక సందర్భంలో ఈ ప్రాజెక్ట్ను ప్రకటించడమే కాకుండా, మేకర్స్ చంద్రిక రవి పాత్రను సిల్క్ స్మితగా పరిచయం చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ లో అచ్చు సిల్క్ స్మితలానే కనిపించారు చంద్రిక రవి. చీర ధరించి, నుదిటిపై బిందీ, సొగసైన కళ్ళతో గోళ్లు కొరుకుతూ ప్రజెంట్ చేసిన లుక్ లో సిల్క్ స్మితలా ప్రేక్షకులని మురిపించారు చంద్రిక రవి. ఆమె కుటుంబ సభ్యుల ఆశీర్వాదంతో, మేకర్స్ సిల్క్ స్మిత 'ది అన్టోల్డ్ స్టోరీ'ని ప్రపంచానికి చెప్పనున్నారు. సినిమా రెగ్యులర్ షూట్ త్వరలో ప్రారంభమవుతుంది. ఈ చిత్రాన్ని 2024లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తారు మేకర్స్.






# ఆకట్టుకుంటోన్న విశాల్

మాస్ హీరో విశాల్ కొత్త సినిమా రత్నం. స్టోన్ బెంచ్ ఫిల్మ్స్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి హరి దర్శకత్వం వహించారు. కళ్యాణ్ సుబ్రహ్మణ్యం, అలంకార్ ప్యాండన్ సహ నిర్మాతలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విశాల్ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్గా నటించారు. ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందించారు. తాజాగా ఈ చిత్రం టైటిల్తో పాటుగా, ఫస్ట్ షాట్ టీజర్ను విడుదల చేశారు. ఈ ఫస్ట్ షాట్ టీజర్ ప్యూర్ గూస్ బంప్స్ స్టఫ్లా అనిపించింది. ఆ బ్యాక్ డ్రాప్, ఆ సెటప్, దేవీ శ్రీ ప్రసాద్ ఇచ్చిన ఆర్ఆర్, కత్తితో తల నరికేయడం, విశాల్ మాస్ అవతారం ఇలా అన్నీ కలిసి ఈ ఫస్ట్ షాట్ టీజర్ను అద్భుతం అనేలా చేశాయి. 'కన్నీరే నెత్తురు చిందగా.. క్రోదమే రుధిరం చిమ్మగా.. ఆగ్రహమే అరుణధారగా.. రణరంగమే రక్తపు ఏరుగా' అంటూ బ్యాక్ గ్రౌండ్లో వచ్చే మాటలు రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తాయి.తలని నరికిన రక్తంతో టైటిల్ పేరు రావడం, ఆ రక్తమే రత్నం అనే టైటిల్గా మారడం మాస్ ఆడియెన్స్ను ఆకట్టుకునేలా ఉంది. ఈ సినిమాకు వివేక్ పాటలు రాశారు. ఎం సుకుమార్ కెమెరామెన్గా పని చేశారు. ఈ చిత్రానికి టీ ఎస్ జయ్ ఎడిటర్. ఆర్ట్ డైరెక్టర్ పీ వీ బాలాజీ. కనల్ కన్నన్, పీటర్ హెయిన్, దిలిప్ సుబ్రయాన్, విక్కీ స్టంట్ మాస్టర్లుగా పని చేశారు. విశాల్, ప్రియా భవానీ శంకర్, సముద్రఖని, యోగి బాబు, గౌతమ్ వాసుదేవ్ మీనన్ వంటి వారు నటించిన ఈ మూవీ మిగతా అప్డేట్లు త్వరలోనే రానున్నాయి.

# అస్సలు బోర్ కొట్టలేదు

చిన్నారి పెళ్లికూతురు సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులను అలరించి 'ఉయ్యాల జంపాల' సినిమాతో కథానాయికగా తెలుగు ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చింది బాలీవుడ్ బుల్లితెర నటి అవికాగోర్. ఈ సినిమాతో అవికా మంచి గుర్తింపును సంపాదించుకుంది. అయితే చాలా రోజుల గ్యాప్ తర్వాత మ్యాన్షన్ 24 అనే వెబ్ సిరీస్‌తో ముందుకు వచ్చింది అవికా. ప్రస్తుతం ఈ సిరీస్ ఓటీటీలో స్ట్రీమ్ అవుతుంది. ఇక ఈ సిరీస్ వచ్చి నెల రోజులు కాకుండానే మరో వెబ్ సిరీస్‌ను లైన్‌లో పెట్టింది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'వధువు'. మ్యారేజ్ ఫుల్ ఆఫ్ సీక్రెట్స్ అనేది క్యాప్షన్. పోలూరు కృష్ణ దర్శకత్వం వహించాడు. బిగ్‌బాస్ ఫేమ్ అలీ రెజా, నందు కూడా కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే సిరీస్ సంబంధించిన ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్, ట్రైలర్‌లను విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ వెబ్ సిరీస్ ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ డిస్నీ+ హాట్‌స్టార్‌లో డిసెంబర్ 08 నుంచి స్ట్రీమింగ్ కానున్న విషయం తెలిసిందే. అయితే విడుదల తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా సిరీస్ ప్రమోషన్స్‌లో పాల్గొన్న అవికా పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'వధువు' గురించి అవికా మాట్లాడుతూ.. థ్రిల్లర్ జానర్‌లో ఈ వెబ్ సిరీస్ రూపొందినట్లు వెల్లడించింది. బెంగాలీ సక్సెస్ ఫుల్ వెబ్ సిరీస్ 'ఇందు'ను తెలుగులో 'వధువు'గా తీసుకొస్తున్నట్లు తెలిపింది. కేవలం పదేళ్ల వయసులో 'చిన్నారి పెళ్లికూతురు' సీరియల్ లో నటించాను. అప్పటికి పెళ్లంటే ఏంటో కూడా నాకు సరిగ్గా తెలిదు. డైరెక్టర్ ఏం చెబితే అదే చేసేదాన్ని. 'వధువు' పేరుతో ఈ స్టోరీ రాగానే నాకు 'చిన్నారి పెళ్లికూతురే మొదట గుర్తొచ్చింది. కానీ ఇది ఓ భిన్నమైన కథ. థ్రిల్లర్ కథగా ఆద్యంతం ఆసక్తికరంగా ఉంటుంది. ఇలా ఎందుకు జరిగిందనే ప్రశ్నలు ప్రేక్షకులను వెంటాడుతూ ఉంటాయి. ఇక తనకు పెళ్లి కూతురిగా ముస్తాబు కావడం అంటే చాలా ఇష్టమని చెప్పింది అవికా. సీరియల్స్, సినిమాల్లో ఇప్పటి వరకు 20 సార్లకు పైగా పెళ్లి చేసుకోని ఉంటానని చెప్పింది.' చిన్నారి పెళ్లి కూతురు'లో నటించడం వల్ల విషయాలు తెలుసుకున్నట్లు తెలిపింది. 'వధువు' కోసం పెళ్లి పీటల మీద కూర్చున్నప్పుడు చాలా సీన్లలో నేచురల్ గా నటించినట్లు వెల్లడించింది.

# ఎక్స్ట్రార్డినరీగా ఉండబోతుంది
## -నితిన్

టాలెంటెడ్, ఛర్మిస్మేటిక్ హీరో నితిన్ కథానాయకుడిగా వక్కంతం దర్శకత్వంలో శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్టైన్మెంట్స్, రుచిర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్స్పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తోన్న ఔట్ అండ్ ఔట్ ఎంటర్టైనర్ 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్'. డిసెంబర్ 8న రిలీజ్ అవుతున్న ఈ సినిమా నుంచి శనివారం చిత్ర యూనిట్ 'ఓలే ఓలే పాపాయి..' అనే పాటను రిలీజ్ చేసింది. హేరిస్ జైరాజ్ సంగీత సారథ్యంలో ఈ పాటను రామ్ మిర్యాల, ప్రియా హేమెస్ పాడారు. కాసర్ల శ్యామ్ పాటను రాశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్ మీట్లో... చిత్ర నిర్మాత ఎమ్.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ "ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్' సినిమాను స్టార్ట్ చేసి ఏడాదిన్నర అవుతుంది. నితిన్, డైరెక్టర్ వక్కంతం వంశీ ఎంతో కష్టపడ్డారు. టైటిల్కి తగ్గట్టు, ప్రేక్షకుల అంచనాలను ధీటుగా సినిమా ఎక్స్ట్రార్డినరీగా ఉంటుంది. ఈ సినిమా కోసం పని చేసిన నటీనటులు, సాంకేతిక నిపుణలకు థాంక్స్" అన్నారు. దర్శకుడు వక్కంతం వంశీ మాట్లాడుతూ "'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్' సినిమా టీజర్, పాటలు, ఇప్పుడు ట్రైలర్కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ చూసి ప్రేక్షకులు చాలా ఎంజాయ చేశారు. ట్రైలర్లానే సినిమా ఉంటుందా? అని అందరూ అడుగుతున్నారు. ట్రైలర్కు పదింతలుగా 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్' ఉంటుంది. మంచి బిర్యానీ తినిపిస్తా. ఈ సందర్భంగా నితిన్కి స్పెషల్ థాంక్స్ చెప్పాలి. నాతో అడుగడుగునా అండగా నిలబడుతూ నడిచారు. తన సపోర్ట్ లేకపోతే ఈ సినిమాను ఇలా తీసేవాడిని కాను. అలాగే నిర్మాత సుధాకర్ రెడ్డిగారికి థాంక్స్. డిసెంబర్ 8న అందరూ థియేటర్స్లో కలుద్దాం. సెలబ్రేట్ చేసుకుందాం" అన్నారు. హీరో నితిన్ మాట్లాడుతూ "ట్రైలర్ జనాల్లోకి ఎంత బాగా వెళ్లిందనేది వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే తెలుస్తుంది. 'ఎక్స్ట్రా ఆర్డినరీ మ్యాన్' మూవీ ఎక్స్ట్రా ఎంటర్టైన్మెంట్తో ఎక్స్ట్రార్డినరీగా ఉండబోతుంది. డిసెంబర్ 8న మూవీ రిలీజ్ అవుతుంది. నా కెరీర్లో నేను చేసిన సినిమాల్లో ఇది బెస్ట్ క్యారెక్టర్ అవుతుంది. ఈ క్యారెక్టర్ చేసేటప్పుడు ప్రతిరోజూ ఎంజాయ్ చేశాను. కచ్చితంగా సినిమాను చూసి ఎంజాయ్ చేస్తారని ప్రామిస్ చేస్తున్నాను. డిసెంబర్ 8 నాతో పాటు నా టీమ్కి, ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది" అన్నారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com